27-02-2021 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

" మధురమైన పిల్లలారా - మిమ్ములను రావణ రాజ్యము నుండి ముక్తులుగా చేసి సద్గతినిచ్చుటకు నరకవాసులను స్వర్గవాసులుగా తయారు చేయుటకు తండ్రి వచ్చారు "

ప్రశ్న:- భారతవాసీ పిల్లలైన మీకు తండ్రి ఏ ఏ స్మృతులను కలిగించారు.?

జవాబు :- ఓ భారతవాసీ పిల్లలారా! మీరు స్వర్గవాసులుగా ఉండేవారు - నేటికి 5 వేల సంవత్సరాల క్రితం భారతదేశము స్వర్గంగా ఉండేది. బంగారు, వజ్రాల భవనాలుండేవి. మీరు విశ్వమంతటికీ రాజులుగా(యజమానులుగా) ఉండేవారు. భూమి, ఆకాశము అన్నీ మీవిగా ఉండేవి. భారతదేశము శివబాబా స్థాపించిన శివాలయంగా ఉండేది, అక్కడ పవిత్రత ఉండేది, ఇప్పుడు మళ్ళీ అటువంటి భారతదేశము తయారవ్వనున్నదని పిల్లలైన మనకు తండ్రి స్మృతిని కలిగించారు.

పాట :- నయన హీనులకు దారి చూపండి ప్రభూ!..... (నయన్ హీన్ కో రాహ్ దిఖావో ప్రభూ!....)

ఓంశాంతి. మధురమైన ఆత్మిక పిల్లలూ!(ఆత్మలు) ఈ పాట విన్నారు. ఇలా ఎవరన్నారు? ఆత్మిక తండ్రి అన్నారు. ఆత్మల తండ్రిని ఆత్మిక పిల్లలు "ఓ బాబా!" అని అంటున్నారు. వారిని ఈశ్వరుడని కూడా అంటారు. తండ్రి(పిత) అని కూడా అంటారు. ఎటువంటి 'పిత' ? 'పరమపిత'. ఎందుకంటే ఇద్దరు తండ్రులు ఉన్నారు, ఒకరు లౌకిక తండ్రి, రెండవవారు పారలౌకిక తండ్రి. లౌకిక తండ్రి పిల్లలు పారలౌకిక తండ్రిని " ఓ తండ్రీ! " అని పిలుస్తున్నారు. అయితే మరి బాబా పేరు ఏమిటి? 'శివ' వారు నిరాకారులుగా పూజింపబడ్తున్నారు. వారిని 'సుప్రీమ్ ఫాదర్' అని కూడా అంటారు. లౌకిక తండ్రిని సుప్రీమ్ అని అనరు. ఉన్నతాతి ఉన్నతమైనవారు సర్వాత్మల తండ్రి ఒక్కరు మాత్రమే. జీవాత్మలందరూ ఆ తండ్రినే స్మృతి చేస్తారు. మన తండ్రి ఎవరో అని కూడా ఆత్మలందరూ మర్చిపోయారు. 'ఓ గాడ్‌ఫాదర్!' అని పిలుస్తారు. నయనహీనులైన మాకు కనులు ఇస్తే మా తండ్రిని తెలుసుకోగలము, గుర్తించగలము అని అంటారు. భక్తిమార్గపు దెబ్బల నుండి విడిపించండి అని పిలుస్తారు. సద్గతి కొరకు మూడవ నేత్రాన్ని పొందేందుకు తండ్రిని కలుసుకునేందుకు పిలుస్తారు. ఎందుకంటే కల్ప-కల్పము తండ్రే భారతదేశంలో వచ్చి భారతదేశాన్ని స్వర్గంగా చేస్తారు. ఇప్పుడిది కలియుగము. కలియుగము తర్వాత సత్యయుగం వస్తుంది. ఇది పురుషోత్తమ సంగమ యుగము. అనంతమైన తండ్రి వచ్చి ఎవరైతే పతిత భ్రష్టాచారులుగా అయ్యారో వారిని పురుషోత్తములుగా చేస్తారు. ఈ లక్ష్మీనారాయణులు పురుషోత్తమ భారతదేశంలో ఉండేవారు. లక్ష్మీనారాయణుల వంశస్థుల రాజ్యముండేది. నేటి నుండి 5 వేల సంవత్సరాల క్రితము సత్యయుగములో శ్రీ లక్ష్మీనారాయణుల రాజ్యముండేది, దీనిని పిల్లలకు స్మృతినిప్పిస్తున్నారు. భారతవాసులైన మీరు 5 వేల సంవత్సరాల క్రితం స్వర్గవాసులుగా ఉండేవారు. ఇప్పుడైతే అందరూ నరకవాసులుగా ఉన్నారు. 5 వేల సంవత్సరాల క్రితం భారతదేశం స్వర్గము(హెవెన్)గా ఉండేది. భారతదేశానికి చాలా గొప్ప మహిమ ఉండేది. బంగారు, వజ్రాల భవనాలుండేవి. ఇప్పుడవేవీ లేవు. ఆ సమయంలో సూర్యవంశీయుల ధర్మము తప్ప మరే ఇతర ధర్మమూ లేదు. చంద్ర వంశీయులు కూడా తర్వాత వస్తారు. మీరు సూర్య వంశానికి చెందినవారని తండ్రి తెలిపిస్తున్నారు. ఇప్పటివరకూ

ఈ లక్ష్మీనారాయణుల మందిరాలను నిర్మిస్తూనే ఉన్నారు కానీ లక్ష్మీనారాయణుల రాజ్యము ఎప్పుడుండేదో, వారు ఆ రాజ్యాన్ని ఎలా పొందారో ఎవ్వరికీ తెలియదు. పూజిస్తారు కానీ వారిని గురించి తెలియదు. కావున ఇది అంధ విశ్వాసం కదా. శివుని పూజిస్తారు, లక్ష్మీనారాయణులను పూజిస్తారు. కానీ వారి జీవితచరిత్ర కూడా తెలియదు. " మేము పతితమయ్యాము. పతితులైన మమ్ములను పావనముగా చేసే బాబా! మీరు రండి. వచ్చి దు:ఖము నుండి, రావణరాజ్యము నుండి విడిపించి స్వతంత్రులుగా చేయండి" అని ఇప్పుడు భారతవాసులు స్వయంగా అంటున్నారు. తండ్రే వచ్చి అందరినీ విముక్తులుగా చేస్తారు. సత్యయుగంలో ఒకే రాజ్యముండేదని పిల్లలకు తెలుసు. బాపూజీ కూడా - మాకు మరలా రామరాజ్యం కావాలని అనేవారు. పతితమైపోయిన గృహస్థ ధర్మము మళ్లీ పావనంగా అవ్వాలి. మనము స్వర్గవాసులుగా అవ్వాలని కోరుకుంటున్నాము, ఇప్పుడు నరకవాసుల స్థితి ఎలా ఉందో చూస్తున్నారు కదా. దీనిని నరకమని, రాక్షస ప్రపంచమని (డెవిల్ వరల్డ్) అంటారు. ఇదే భారతదేశము దైవీ ప్రపంచంగా ఉండేది. తండ్రి కూర్చుని అర్థం చేయిస్తున్నారు - " మీరు 84 జన్మలు తీసుకున్నారు, 84 లక్షలు కాదు. " తండ్రి తెలుపుతున్నారు - అసలు మీరు శాంతిధామంలో నివసించేవారు. మీరు ఇక్కడకు పాత్ర చేసేందుకు వస్తారు. 84 జన్మల పాత్ర చేశారు. పునర్జన్మ అయితే తప్పకుండా తీసుకోవలసి వస్తుంది కదా! 84 పునర్జన్మలుంటాయి.

పిల్లలైన మీకు అనంతమైన వారసత్వమునిచ్చేందుకు అనంతమైన తండ్రి వచ్చారు. తండ్రి పిల్లలైన(ఆత్మలు) మీతో మాట్లాడుతున్నారు. ఇతర సత్సంగాలలో మనుష్యులు మనుష్యులకు భక్తిమార్గపు మాటలు వినిపిస్తారు. అర్ధకల్పము భారతదేశము స్వర్గంగా ఉండేది. అప్పుడు పతితులు ఒక్కరు కూడా లేరు, ఇప్పుడేమో ఒక్కరు కూడా పావనంగా లేరు. ఇది అయ్యిందే పతిత ప్రపంచము. గీతలో కృష్ణ భగవానువాచ అని వ్రాసేశారు. అతను గీతను వినిపించనేలేదు. వీరికి తమ ధర్మశాస్త్రము గురించి కూడా తెలియదు. తమ ధర్మాన్ని కూడా మర్చిపోయారు. హిందూ అనేది ధర్మము కాదు. ముఖ్యమైన ధర్మాలు నాలుగు. మొదటిది ఆదిసనాతన దేవీ దేవతా ధర్మము. సూర్య వంశము, చంద్ర వంశము, రెండిటినీ కలిపి దేవీ దేవతా ధర్మము, దైవీ రాజ్యమని అంటారు. అక్కడ దు:ఖమనే పేరు కూడా లేదు. 21 జన్మలు మీరు సుఖధామంలో ఉండేవారు. ఆ తర్వాత రావణరాజ్యము, భక్తిమార్గము ప్రారంభమౌతుంది. భక్తిమార్గమంటే క్రిందికి దిగేది. భక్తి అనేది రాత్రి, జ్ఞానమనేది పగలు. ఇప్పుడు ఉండేది గాఢాంధకార రాత్రి. శివజయంతి, శివరాత్రి అనే రెండు పదాలు ఉన్నాయి. శివబాబా ఎప్పుడు వస్తారు? రాత్రి అయినప్పుడు వస్తారు. భారతవాసులు గాఢాంధకారములోకి వచ్చినప్పుడు తండ్రి వస్తారు. బొమ్మలపూజ చేస్తూ ఉంటారు కానీ ఒక్కరి జీవితచరిత్ర గురించి కూడా తెలియదు. భక్తిమార్గములోని శాస్త్రాలు కూడా తయారవ్వే తీరాలి. ఇది డ్రామా. సృష్టి చక్రాన్ని కూడా అర్థము చేసుకోవాలి. శాస్త్రాలలో ఈ జ్ఞానము(నాలెడ్జ్) లేదు. అది భక్తిని గురించిన జ్ఞానము, వేదాంతము, అది సద్గతి మార్గాన్ని తెలిపే జ్ఞానము కాదు. తండ్రి అంటున్నారు - " నేను వచ్చి మీకు బ్రహ్మ ద్వారా యదార్థమైన జ్ఞానము వినిపిస్తాను. మాకు సుఖధామము, శాంతిధామాల మార్గాన్ని చూపమని పిలుస్తూ ఉంటారు." తండ్రి అంటున్నారు -

ఇప్పటికి 5 వేల సంవత్సరాల క్రితం సుఖధామముండేది. అందులో మీరు మొత్తం విశ్వం పై రాజ్యపాలన చేసేవారు. సూర్యవంశ రాజ్యముండేది. మిగిలిన ఆత్మలన్నీ శాంతిధామంలో ఉండేవి. అక్కడ 9 లక్షలు అనే గాయనముంది. పిల్లలైన మిమ్ములను 5 వేల సంవత్సరాల క్రితం చాలా ధనవంతులుగా చేశాను. అంత ధనము మీరు ఎక్కడ పోగొట్టుకున్నారు. మీరు ఎంత గొప్ప ధనవంతులుగా ఉండేవారు! భారతదేశం ఎలా పిలువబడేది! భారతదేశమే అన్నిటికన్నా ఉన్నతమైన ఖండము. వాస్తవానికి ఇదే అందరికీ తీర్థ స్థానము ఎందుకంటే ఇది పతితపావనుడైన తండ్రికి జన్మ స్థానము. ఏ ఏ ధర్మాల వారైతే ఉన్నారో వారందరికి తండ్రి ఇక్కడకు వచ్చి సద్గతినిస్తారు. ఇప్పుడు సృష్టి అంతటి పై రావణరాజ్యముంది. కేవలం ఒక లంకలోనే కాదు, అందరిలోనూ 5 వికారాలు ప్రవేశమై ఉన్నాయి. సూర్యవంశ రాజ్యమున్నప్పుడు ఈ వికారాలే లేవు. భారతదేశము నిర్వికారిగా ఉండేది, ఇప్పుడు వికారిగా ఉంది. సత్యయుగంలో దైవీ సంప్రదాయముండేది. వారే 84 జన్మలు అనుభవించి ఇప్పుడు ఆసురీ సంప్రదాయస్థులుగా అయ్యారు. మళ్లీ దైవీ సంప్రదాయులుగా అవుతారు. భారతదేశము చాలా ధనవంతంగా ఉండేది. ఇప్పుడు పేదగా తయారయ్యింది. అందువలన భిక్షమెత్తుకుంటున్నారు.

తండ్రి అంటున్నారు - " మీరు ఎంతో ధనవంతులుగా ఉండేవారు. మీ అంతటి సుఖము ఇతరులెవ్వరికీ లభించదు. మీరు మొత్తం విశ్వానికి యజమానులుగా ఉండేవారు. భూమి, ఆకాశము అన్నీ మీవిగానే ఉండేవి. తండ్రి స్మృతిని కలిగిస్తున్నారు - భారతదేశము శివబాబా స్థాపించిన శివాలయము. అక్కడ పవిత్రత ఉండేది. ఆ నూతన ప్రపంచములో దేవీదేవతలు రాజ్యపాలన చేసేవారు. రాధా-కృష్ణులకు పరస్పరం ఎలాంటి సంబంధముండేదో కూడా భారతవాసులకు తెలియదు. ఇరువురూ వేరు వేరు రాజధానులకు చెందినవారు. స్వయంవరం తర్వాత లక్ష్మీనారాయణులుగా అయ్యారు. ఈ జ్ఞానము ఏ మనుష్యులలోనూ లేదు. పరమపిత పరమాత్మయే జ్ఞానసాగరులు. వారే మీకు ఈ ఆత్మిక జ్ఞానమునిస్తారు. ఈ ఆత్మిక జ్ఞానము(స్పిరిచువల్ నాలెడ్జ్) ఒక్క తండ్రి మాత్రమే ఇవ్వగలరు. ఇప్పుడు తండ్రి అంటున్నారు - ఆత్మాభిమానులుగా అవ్వండి. పరమపిత పరమాత్మ శివుడైన నన్ను స్మృతి చేయండి. స్మృతి ద్వారానే సతోప్రధానంగా అవుతారు. మీరు ఇక్కడకు వచ్చేదే మనుష్యుల నుండి దేవతలుగా లేక పతితుల నుండి పావనులుగా అయ్యేందుకు. ఇప్పుడిది రావణరాజ్యం. భక్తిమార్గంలో రావణరాజ్యం ప్రారంభమౌతుంది. రావణుడు ఒక్క సీతను మాత్రమే దొంగలించలేదు. వాస్తవానికి భక్తి చేసే మీ(సీతల)రందరూ రావణుని పంజాలో ఉన్నారు. మొత్తం సృష్టి అంతా 5 వికారాలనే రావణుని జైలులో ఉంది. అందరూ శోకవాటికలో దుఃఖితులుగా ఉన్నారు. తండ్రి వచ్చి అందరినీ విడుదల చేస్తారు. ఇప్పుడు మళ్లీ తండ్రి స్వర్గాన్ని తయారు చేస్తున్నారు. అంతేకానీ ఇప్పుడు ఎవరి వద్ద ధనము చాలా ఉందో వారు స్వర్గములో ఉన్నారని కాదు. ఇప్పుడిది నరకము, అందరూ పతితులే. అందువలన గంగలోకి వెళ్ళి స్నానము చేస్తారు. గంగ పతితపావని అని భావిస్తారు. కానీ ఒక్కరు కూడా పావనంగా అవ్వరు. పతితపావనుడని తండ్రిని మాత్రమే అంటారు, నదులను కాదు. ఇదంతా భక్తిమార్గము. తండ్రే వచ్చి ఈ విషయాలన్నీ అర్థము చేయిస్తున్నారు. ఒకరు లౌకిక తండ్రి,

రెండవవారు ప్రజాపిత బ్రహ్మ అలౌకిక తండ్రి, వారు పారలౌకిక తండ్రి - ముగ్గురు తండ్రులున్నారని ఇప్పుడు మీకు తెలుసు. శివబాబా ప్రజాపిత బ్రహ్మ ద్వారా బ్రాహ్మణ ధర్మాన్ని స్థాపన చేస్తారు. బ్రాహ్మణులను దేవతలుగా తయారు చేసేందుకు రాజయోగాన్ని నేర్పిస్తున్నారు. ఒక్కసారి మాత్రమే తండ్రి వచ్చి ఆత్మలకు రాజయోగాన్ని నేర్పిస్తారు. ఆత్మలు పునర్జన్మలు తీసుకుంటాయి. ఆత్మనే - నేను ఒక శరీరాన్ని వదిలి రెండవది తీసుకుంటానని అంటుంది. తండ్రి అంటున్నారు - స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రినైన నన్ను స్మృతి చేస్తే మీరు పావనంగా అవుతారు. ఏ దేహధారినీ స్మృతి చేయకండి. ఇది మృత్యులోకము సమాప్తమయ్యే సమయము, అమరలోకము స్థాపనవుతూ ఉ ంది. మిగిలిన ధర్మాలన్నీ సమాప్తమై పోతాయి. సత్యయుగంలో ఒకే ఒక దేవతా ధర్మముండేది. త్రేతా యుగంలో చంద్రవంశీ సీతా- రాములుండేవారు. పిల్లలైన మీకు మొత్తం చక్రమంతటి స్మృతినిప్పిస్తారు. శాంతిధామము, సుఖధామాలను తండ్రే స్థాపన చేస్తారు. మనుష్యులు మనుష్యులకు సద్గతినివ్వలేరు. వారంతా భక్తిమార్గంలోని గురువులు. భక్తిమార్గంలో మనుష్యులు అనేక విధాలైన చిత్రాలను తయారు చేసి పూజించి నీటిలో వేసి ' మునిగిపో, మునిగిపో ' అని అంటారు. చాలా పూజలు చేస్తారు, తినిపిస్తారు, తాపిస్తారు కానీ తినేవారు బ్రాహ్మణులే, దీనిని బొమ్మలపూజ అని అంటారు. ఎంత మూఢ విశ్వాసము! కానీ ఇప్పుడు అటువంటివారికి ఎవరు అర్థం చేయించాలి?

తండ్రి అంటున్నారు - ఇప్పుడు మీరు ఈశ్వరీయ సంతానము, మీరు తండ్రి నుండి రాజయోగము నేర్చుకుంటున్నారు. ఈ రాజధాని స్థాపనవుతూ ఉంది. చాలామంది ప్రజలు తయారవ్వాలి. కోట్లలో ఎవరో ఒక్కరు మాత్రమే రాజుగా అవుతారు. సత్యయుగాన్ని పుష్పాలతోట అని అంటారు. ఇప్పుడుండేది ముళ్ళ అడవి. ఇప్పుడు రావణ రాజ్యం మార్పు చెందుతూ ఉంది. ఇది వినాశనమయ్యే తీరాలి. ఈ జ్ఞానం ఇప్పుడు బ్రాహ్మణులైన మీకు మాత్రమే లభిస్తుంది. లక్ష్మీనారాయణులకు కూడా ఈ జ్ఞానముండదు. ఈ జ్ఞానం ప్రాయః లోపమైపోతుంది. భక్తిమార్గంలో ఒక్కరికి కూడా తండ్రిని గురించి తెలియదు. తండ్రే రచయిత. బ్రహ్మ-విష్ణు-శంకరులు కూడా వారి రచనయే. పరమాత్మ సర్వవ్యాపి అనుట వలన అందరూ తండ్రులే అయిపోతారు. వారసత్వపు హక్కు ఉండదు. తండ్రి వచ్చి పిల్లలందరికీ వారసత్వమునిస్తారు. సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రి మాత్రమే. మొట్టమొదట సత్యయుగంలో వచ్చేవారు 84 జన్మలు తీసుకుంటారని కూడా తెలిపించారు. క్రైస్తవులకు ఎన్ని జన్మలుంటాయి? 40 జన్మలుండవచ్చు, లెక్క కట్టవచ్చు. ఒక్క భగవంతుని వెతికేందుకు ఎన్నో ఎదురుదెబ్బలు తింటారు. ఇప్పుడు మీరు ఎదురుదెబ్బలు తినరు. ఇప్పుడు మీరు కేవలం ఒక్క తండ్రిని మాత్రమే స్మృతి చేయాలి. ఇది స్మృతియాత్ర, ఇది పతితపావనుడైన గాడ్‌ఫాదర్లీ యూనివర్సిటీ(ఈశ్వరీయ విశ్వవిద్యాలయము). మీ ఆత్మ చదువుకుంటుంది. సాధు సత్పురుషులు ఆత్మ నిర్లేపమని అంటారు కానీ కర్మలనుసారము ఆత్మనే మరో జన్మ తీసుకోవాల్సి వస్తుంది. ఆత్మనే మంచి లేక చెడు పనులు చేస్తుంది. కలియుగంలో మీ కర్మలు వికర్మలుగా అవుతాయి. సత్యయుగంలో కర్మ అకర్మగా అవుతుంది. అక్కడ వికర్మలు జరగవు. అది పుణ్యాత్మల ప్రపంచము. ఇవన్నీ అర్థము చేసుకుని అర్థము చేయించే విషయాలు.

మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. ముళ్ళ నుండి పుష్పాలుగా తయారై పుష్పాలతోట(సత్యయుగము)ను స్థాపన చేసే సేవ చేయాలి. ఎలాంటి చెడు కర్మలూ చేయరాదు.

2. తండ్రి నుండి విన్న ఆత్మిక జ్ఞానాన్నే అందరికీ వినిపించాలి, ఆత్మాభిమానులుగా అయ్యే శ్రమ చేయాలి. ఒక్క తండ్రిని మాత్రమే స్మృతి చేయాలి. ఏ దేహధారినీ స్మృతి చేయరాదు.

వరదానము :- " సదా మీ రాయల్ కులపు స్మృతి ద్వారా ఉన్నతమైన స్థితిలో ఉండే గుణమూర్త్ భవ "

ఎవరైతే రాయల్ కులము వారుగా ఉంటారో వారు ఎప్పుడూ భూమిపై మట్టిపై పాదము మోపరు. ఇక్కడ దేహాభిమానము మట్టి. ఇందులో క్రిందికి రాకండి, ఈ మట్టి నుండి సదా దూరంగా ఉండండి. సదా అత్యంత ఉన్నతమైన తండ్రి యొక్క రాయల్ ఫ్యామిలీకి చెందిన ఉన్నత స్థితిలోని పిల్లలమని స్మృతిలో ఉంచుకుంటే దృష్టి క్రిందికి రాదు. సదా స్వయాన్ని గుణమూర్తిగా చూస్తూ ఉన్నతమైన స్టేజిలో స్థితమై ఉండండి. లోపాన్ని గమనిస్తూ సమాప్తం చేస్తూ ఉండండి. ఆ లోపాన్ని పదే పదే ఆలోచిస్తూ ఉంటే ఆ లోపము అలాగే ఉంటుంది.

స్లోగన్ :- " ఎవరైతే తమ హర్షిత ముఖము ద్వారా పవిత్రత యొక్క రాయల్టీని అనుభవం చేయిస్తారో, వారే రాయల్ ఆత్మలు . "